సాక్షి
బాపట్ల
సోమవారం, 27, ఫిబ్రవరి, 2023



మోపిదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మోపిదేవి:వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు.



నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):విజయవాడకు చెందిన పట్నాల నాగేశ్వరరావు కుటుంబం అమ్మవారి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని ఆదివారం అందజేసింది.



ఉల్లాసంగా స్విమ్మింగ్ పోటీలు

తాడేపల్లిరూరల్: కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. 400 మంది పోటీల్లో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శునకాల అందాల పోటీ అదరహో



పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కెనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వివిధ జాతుల ప్యూర్ బ్రీడ్ డాగ్ కాంపిటీషన్, ఫ్యాషన్‌షో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి క్లబ్ గౌరవాధ్యక్షుడు, గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమ్‌వర్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ గుంటూరు వేదికగా డాగ్ షోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పెట్ డాగ్స్‌తో జరిగే ప్రయోజనాలపై అవగాహన కలుగుతుందన్నారు. మనం ఇంట్లోకి వచ్చే ముందే అవి మనల్ని పసిగట్టి ఆప్యాయతతో లోనికి ఆహ్వానిస్తాయని తెలిపారు. మన ఇంటికి ఎంతో రక్షణగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రదర్శనలో అనేక రకాల జాతుల శునకాలు పాల్గొన్నాయి. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబర్చిన పెట్ డాగ్స్‌లకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమాలను క్లబ్ అధ్యక్షుడు పి.రామచంద్రరాజు, కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆకాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. రాజగోపురం ఎదుట కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించారు. సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కళావేదికపై ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో భక్తులతో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంకు చెందిన శ్రీకృష్ణ కుటుంబం దుర్గమ్మకు ఆదివారం బంగారపు నత్తు కానుకగా సమర్పించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబను కలిసి 12.5 గ్రాముల బంగారంతో సుమారు రూ.75 వేల వ్యయంతో తయారు చేయించిన నత్తును అమ్మవారికి అలంకరించేందుకు అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్లో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు చేవూరి రామస్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తోలేటి శ్రీకాంత్ తొలుత విశ్వకర్మ భగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు అందించాలని కోరారు. విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీనివాస్, కోశాధికారి పిరంగి చంద్రశేఖర్, ప్రకాశం జిల్లా డైరెక్టర్ రజనీ, యువజన అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళ అధ్యక్షురాలు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం
ఇక బంగారం!

- ఈ భూముల రీసర్వేకు నిర్ణయం
- జిల్లాలో నాలుగు పైలెట్ గ్రామాల్లో సర్వే పూర్తి
- వందల ఏళ్లుగా లావాదేవీలకు అవకాశం లేదు
- తాజా నిర్ణయంతో లబ్ధిదారులకు ఊరట
- ఈ నెలాఖరుకు లబ్ధిదారులకు పట్టాలు
- మరో ఆరు గ్రామాల్లోనూ రీసర్వే చకచకా
- త్వరలోనే అన్ని గ్రామాల్లో గ్రామకంఠం భూముల సర్వే



మంగళగిరిపాడులోని గ్రామ కంఠం భూముల రీ-సర్వేలో మ్యాపులు పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గ్రామకంఠం భూములకు మహర్దశ పట్టనుంది. ఈ భూములను రీ-సర్వే చేసి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వంద సంవత్సరాలకు పైగా ఎటువంటి సర్వేకు నోచుకోకుండా, రిజిస్ట్రేషన్లు చేయకుండా, కనీసం ప్రభుత్వ పట్టా అయినా లేకుండా ఈ గ్రామకంఠం భూములు ఉన్నాయి. దాదాపుగా గ్రామ కంఠం భూములను చాలా వరకు అసైన్డ్‌గా పరిగణించడంతోనే వీటిపై ఎటువంటి లావాదేవీలు జరగవు. కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ పథకం ద్వారా వీటి సర్వేకు ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా వీటిని కూడా చేర్చింది. దీంతో ఈ గ్రామకంఠం భూముల సర్వేకు లైన్ క్లియర్ అయ్యింది. గుంటూరు జిల్లాలో ముందుగా నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా వీటిని చేపట్టి విజయవంతంగా సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం మరో ఆరు గ్రామాల్లో సర్వే మొదలుపెట్టారు. ఇప్పటి వరకు 85 ఎకరాల గ్రామకంఠం భూముల సర్వే పూర్తి చేశారు. తొలుత పూర్తి చేసిన సర్వే ఆధారంగా లబ్ధిదారులకు ఈ నెలాఖరుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఆస్తి ధ్రువీకరణ పత్రాలను అందజేయనుంది. ప్రస్తుతం జరుగుతున్న రీ-సర్వేకు అదనంగా జరుగుతున్న ఈ గ్రామకంఠం భూముల సర్వేను జిల్లా పంచాయతీ అధికారులు చేపడుతున్నారు.

సర్వే పూర్తయిన గ్రామాలు ఇవే..

దుగ్గిరాల మండలంలోని చింతలపూడి, శృంగారపురం, డీపీ అగ్రహారం, ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడిలో డ్రోన్ ఫ్లైతో సహా సర్వే పూర్తి చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత కచ్చితత్వంతో నిర్వహించారు. ప్రస్తుతం మేడికొండూరు మండలంలోని పొట్లపాడు, వెలవర్తిపాడు, మంగళగిరిపాడు, కొర్రపాడు, వట్టిచెరుకూరు మండలంలోని కారంపూడిపాడు, లేమల్లెపాడులో సర్వే జరుగుతోంది.

క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు

గ్రామకంఠం భూములపై ప్రభుత్వం ఇచ్చే ఆస్తి ధ్రువీకరణ పత్రంతో బ్యాంకు రుణాలతో పాటు క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. పైగా డ్రోన్‌తో సంబంధిత స్థలానికి సంబంధించి పూర్తి హద్దులు, ఎంత విస్తీర్ణం కూడా కచ్చితత్వంతో అందులో పొందుపరుస్తారు. దీంతో ఈ భూములపై ఉన్న సివిల్ దావాలు, వివాదాలు తొలగిపోతాయి. ఈ నేపథ్యంలో సర్వే పూర్తయిన గ్రామాల్లోని స్థానికులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించడంతో పాటు అధికారులకు సహకరిస్తున్నారు.

ఇదొక విప్లవమే

గ్రామ కంఠ భూముల రీ-సర్వే చేసి పట్టాలు అందించడమంటే ఇది ఒక విప్లవమే. దీంతో ఎన్నో వివాదాలు, తగాదాలు సమసిపోతాయి. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానికుల నుంచి చక్కని సహకారమందింది. రానున్న కాలంలో జిల్లాలోని అన్ని గ్రామ కంఠం భూముల సర్వేను విజయవంతంగా పూర్తి చేస్తాం.

– కేశవరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

చకచకా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు



హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన కోసం ఏర్పాట్లు చకచకా పూర్తిచేస్తున్నారు. రాష్ట్రంలో నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, ఇటీవల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కోసం ముఖ్యమంత్రి ఈ నెల 28వ తేదీ తెనాలి రానున్న విషయం తెలిసిందే. ఇందుకోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో బహిరంగ సభా వేదికను నిర్మించారు. భారీ టెంట్లను ఏర్పాటు చేశారు. అక్కడకు కిలోమీటరు దూరంలోని కవిరాజ నగర్‌లో హెలిప్యాడ్‌ను రూపొందిస్తున్నారు. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి ఈ ఏర్పాట్లను పరిశీలించిన విషయం తెలిసిందే. ఆదివారం కూడా ఎమ్మెల్యే శివకుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. నియోజకవర్గం నుంచి రైతాంగం హాజరయేలా చూస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా తెనాలి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అపురూప స్వాగతం పలికేందుకు రైతులు, నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారని వివరించారు.

28న ట్రాఫిక్ మళ్లింపు

తెనాలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలి పర్యటన నేపథ్యంలో ఆ రోజు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి నారాకోడూరు మీదుగా వెళ్లే వాహనాలను చెంచుపేట మీదుగా వెళ్లేందుకు అనుమతించబోమన్నారు. గుంటూరు వెళ్లాల్సినవారు నందివెలుగు–గుంటూరు రహదారిని ఆశ్రయించాలని పేర్కొన్నారు. బాపట్ల నుంచి నారాకోడూరు మీదుగా తెనాలి వచ్చే అన్ని వాహనాలు పొన్నూరు, ఇంటూరు, తురిమెళ్ల, కూచిపూడి మీదుగా తెనాలి రావాల్సిఉంటుందన్నారు. అంగలకుదురు మీదుగా తెనాలి వచ్చే వాహనాలు దుండిపాలెం డొంక మీదుగా పట్టణంలోకి రావచ్చని తెలిపారు. 108 అంబులెన్స్‌లు, ఇతర ఎమర్జెన్సీ సర్వీసుల వాహనాలకు ఎటువంటి ఆంక్షలు ఉండవని స్పష్టం చేశారు. చెంచుపేట నుంచి అంగలకుదురు వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందని, ప్రజలు గమనించాలని కోరారు.

సీఎం జగన్ తెనాలి పర్యటన షెడ్యూల్ ఇదే

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెనాలి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు సమాచారం అందింది. నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీ తెనాలి నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్న విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం 9:50 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. తాడేపల్లిలోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో 10 గంటలకు బయలుదేరి 10:15 గంటలకు తెనాలి కవిరాజనగర్‌లోని హెలిప్యాడ్‌లో దిగుతారు. ప్రజాప్రతినిధులతో పది నిమిషాలు మాట్లాడి, అక్కడ్నుంచి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని బహిరంగ సభావేదికకు 10:35 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి, లబ్ధిదారులతో ఫొటోలు దిగుతారు. 10:45 గంటల్నుంచి 12:15 గంటల మధ్య రైతులకు నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీని పంపిణీ చేస్తారు. 12.20 గంటలకు సభావేదిక నుంచి హెలిప్యాడ్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ 15 నిమిషాల పాటు స్థానిక నేతలతో ముచ్చటించి 12:45 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరి వెళతారు.

పెండ్లి కుమారుడిగా శ్రీవారు

- వైభవంగా ప్రారంభమైన నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఉదయం తిరుమంజనోత్సవంతో పెండ్లికుమారుడి ఉత్సవం
- రాత్రి గ్రామోత్సవంలో పెండ్లికుమారుడిగా దర్శనమిచ్చిన శ్రీవారు



పెండ్లికుమారుడి అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న మంగళాద్రి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళాద్రి తిరునాళ్లగా పిలవబడే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం స్వామి పెండ్లికుమారుడి అలంకరణలో భక్తులకు దర్శనమించ్చారు. ఈ బ్రహ్మోత్సవాలు పెండ్లికుమారుడి ఉత్సవంతో ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీవారిని అమ్మవార్లను పంచామృత స్నపనతో మంగళస్నానాలు చేయించి అలంకరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు పరమానందభరితులయ్యారు. రాత్రి 7 గంటలకు పెండ్లికుమారుడి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా సాయంత్రం ఐదు గంటల నుంచి రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షణలో మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం వారు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 8 గంటలకు ధ్వజారోహణం నిర్వహిస్తారు. దేవతలను ఆహ్వానించేందుకు భక్తాగ్రేసరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్టించే ఉత్సవంలో అతిప్రధానమైనది. భక్తులు ఈ వేడుకకు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని గరుడుముద్దలు ప్రసాదంగా స్వీకరించాలని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి తెలిపారు.

అసత్య కథనాలపై ఆగని నిరసన జ్వాల

- అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య
- అంబేడ్కర్ విగ్రహానికి విద్యార్థులు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, వినోద్ కుమార్

నెహ్రూనగర్(గుంటూరు): ఈనాడు అసత్య కథనాలపై నిరసన జ్వాల కొనసాగుతోంది. విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్న జగన్ సర్కార్‌పై కుట్రపూరితంగా విషం చిమ్ముతున్న వైనంపై ఉవ్వెత్తున ఆగ్రహం ఎగసిపడుతోంది. ఈనాడు పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి, వ్యవస్థలను మేనేజ్ చేయడానికి అంటూ విద్యార్థి లోకం పేర్కొంటోంది. దిగజారిన పాత్రికేయ విలువలు తప్ప ప్రజాస్వామ్య విలువలు మచ్చుకైనా కానరాని ఈనాడును స్వచ్ఛందంగా బహిష్కరించాలని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నాబత్తిని వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణకు పూనుకుంటామని ప్రతినబూనారు. అనంతరం బాయ్‌కాట్ ఈనాడు అన్న నినాదాలతో గుంటూరు నగరాన్ని హోరెత్తించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ, అబద్ధపు రాతలతో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న ఈనాడు దినపత్రిక వైఖరిని ప్రజలంతా ఏవగించుకుంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిరాళ్ల వంటి నాలుగు మూల స్తంభాల్లో ప్రధానమైన పత్రికారంగాన్ని అడ్డం పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌లో అరాచకాలకు పాల్పడటం ద్వారా ఈనాడు దినపత్రిక, దాని యజమాని రామోజీరావు అంబేడ్కర్‌ను, ఆయన ఆలోచన విధానాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో రామోజీ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కలలుకంటున్న ఈనాడు, దాన్ని పెంచి పోషిస్తున్న చంద్రబాబు కుట్రలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇటు చంద్రబాబు, అటు ఈనాడు యజమాని రామోజీరావు ఎప్పటికప్పుడు కుట్రలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. వైఎస్ జగన్‌పై పన్నే కుతంత్రాలను సహించేందుకు విద్యార్థులు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు విఠల్, రవి, గంటి, బాజి, జగదీష్, భాస్కర్, ప్రభు, కోటి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన పసుపు!

- దుంప కుళ్లుతో 25 శాతం తగ్గిన దిగుబడులు
- పునర్విభజనతో జిల్లాలో గణనీయంగా తగ్గిన విస్తీర్ణం
- ఫలితంగా జిల్లా పసుపు రైతులకు అందని బీమా
- బీమా వర్తింపునకు ప్రతిపాదనలు పంపిన ఉద్యానశాఖ



పచ్చి పసుపును వండుతున్న కూలీలు

తెనాలి: పంటల్లో పసిడిగా.. ఇంటిల్లిపాదీ శుభప్రదంగా భావించే పసుపు పంట ఏళ్లుగా రైతులకు కన్నీళ్లను తెప్పిస్తోంది. ఏటికేడాది దిగుబడులు తగ్గుతున్నాయ్. మార్కెట్ ధరల మాయాజాలంతో రైతులు నష్టాలను మిగులుతున్నయ్. రాష్ట్ర ప్రభుత్వమే రంగంలోకి దిగి, మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. గత ఏడాది జిల్లాలో పసుపు పంటను ప్రథమంగా బీమా పరిధిలోకి తీసుకొచ్చి, నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించింది. గత సీజనులో కురిసిన అధిక వర్షాలు పసుపు పంటకు చేటు తెచ్చాయి. సగటున 25 శాతం దిగుబడులు తగ్గిపోయాయి. విభజిత గుంటూరు జిల్లాలో పసుపు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. బీమా అందని పరిస్థితి. ఉద్యానశాఖ బీమా వర్తింపునకు ప్రతిపాదనలు పంపటం ఒక్కటే ఊరట.

తగ్గిన దిగుబడులు.. ధరలు

2022–23లో సాగు చేసిన పసుపు ఇప్పుడే పక్వానికొచ్చింది. రైతులు పంటను తీస్తున్నారు. పచ్చి పసుపును ఉడికిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. చేలల్లోనూ పసుపు రాశులు కనిపిస్తున్నా, 2012–22తో పోల్చితే దిగుబడులు తగ్గాయి. ఖరీఫ్‌లో వద్దంటున్నా కురిసిన వర్షాలు మాగాణికి మేలు చేసినా, మెట్టలో పసుపును బాగా దెబ్బతీశాయి. చేను ఆరకుండా కురిసిన వర్షాలకు పసుపుకు దుంపకుళ్లు సోకింది. 40 క్వింటాళ్లు పండే చేలో దిగుబడులు 30 క్వింటాళ్లకు పరిమితం కాగా, హీనపక్షం 30 క్వింటాళ్లు వచ్చేచోట, దిగుబడి 25 క్వింటాళ్లకు పరిమితమైంది. మార్కెట్ ధరేమో క్వింటాలు రూ.5,500 మాత్రమే ఉంది. ప్రస్తుతం పసుపు చేను దున్నటానికి రూ.5 వేలు, పసుపు ఏరివేతకు కూలీల ఖర్చు రూ.20 వేల వరకు ఉంది. పసుపు వండటానికి మరో రూ.20 వేల చొప్పున అవుతోందని రైతులు చెబుతున్నారు. విత్తనం కొనుగోలు, నాటేందుకయ్యే ఖర్చుతో కలుపుకుంటే మిగిలేదేం ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉద్యానశాఖ తెనాలి, గుంటూరు డివిజన్ల పరిధిలోనే పసుపు సాగవుతోంది. ఇందులోనూ తెనాలి డివిజనుదే అగ్రస్థానం. 2021–22లో 8,166 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. 2020–21తో పోల్చితే ఈ విస్తీర్ణం 2,479 ఎకరాలు తగ్గింది. ఆ ఏడాది 10,645 ఎకరాల్లో పసుపు పండించగా, అంతకుముందు 2019–20లో ఈ విస్తీర్ణం 11,277 ఎకరాలుగా ఉంది. 2018–19లో 12,057 ఎకరాల్లో పసుపు పండించారు. ఉమ్మడి జిల్లాలో పసుపు పంట విస్తీర్ణం ఏటికేడాది తగ్గిపోతోందని చెప్పేందుకు ఈ గణాంకాలే ప్రబల నిదర్శనం. పెట్టుబడి ఖర్చులు పెరగడం, దిగుబడులు తగ్గిపోతుండటం ఇందుకు ప్రధాన కారణం.

తగ్గిన సాగు విస్తీర్ణంతో వర్తించని బీమా

జిల్లాల పునర్విభజనతో తెనాలి డివిజనులోని అత్యధిక మండలాలు బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లాయి. విభజిత గుంటూరు జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,337 ఎకరాలుకాగా, 2022–23 సీజనుకు కేవలం 3,864 ఎకరాల్లోనే పసుపును సాగుచేశారు. ఇందులో తెనాలి నియోజకవర్గంలోనే అత్యధికంగా 2,257 ఎకరాల్లో పసుపు సాగయింది. గత ఏడాదితో పోలిస్తే ఇక్కడే 1,021 ఎకరాల్లో పంట తగ్గింది. దుగ్గిరాలలో 90 ఎకరాలు, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల్లో 571 ఎకరాలు, మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లో 932 ఎకరాల్లో పసుపును పండించారు. చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను ప్రాంతాల్లో పంట నామమాత్రానికే పరిమితమైంది.

బీమా వర్తింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

జిల్లాలో పసుపు విస్తీర్ణం గణనీయంగా పడిపోవటంతో దుంపకుళ్లుతో నష్టపోయిన పసుపు పంటకు బీమా పరిహారం అందని ప్రమాదం ఏర్పడింది. బీమా వర్తించాలంటే జిల్లాలో పసుపు పంట కనీసం 5,000 ఎకరాల విస్తీర్ణంలో ఉండాలనే నిబంధన ఉంది. జిల్లాలో పసుపు కేవలం 3,864 ఎకరాల్లోనే సాగుచేసినందున బీమాకు అవకాశం లేదు. దీనిపై ఇప్పటికే ఉద్యానశాఖ జిల్లా కలెక్టర్ అనుమతితో బీమా వర్తింపును కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం.

పసుపు దిగుబడి బాగా తగ్గింది



నేను రెండెకరాల్లో పసుపు సాగు చేశాను. ఖరీఫ్‌లో కురిసిన అధిక వర్షాలకు పంట దెబ్బతింది. ఎకరాకు కేవలం 25 క్వింటాళ్లే వచ్చింది. ఇప్పటికి పెట్టుబడి ఎకరాకు రూ.1.50 లక్షలు పెట్టాను. మార్కెట్ ధర ప్రకారం అమ్మితే రూ.1.35 లక్షలే వస్తుంది. ప్రభుత్వం మద్దతు ధర పెంచితే బాగుంటుంది.

– బొంతు శ్రీనివాసరెడ్డి, కొల్లిపర

బీమా వర్తింపజేసేలా చూడాలి



నేను ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో పసుపు పండించాను. ఎకరానికి కేవలం 25 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దుంపకుళ్ల కారణంగా పంట తగ్గింది. జిల్లాలో విస్తీర్ణం తగ్గిందనే కారణంగా బీమా ఇవ్వరని అంటున్నారు. పసుపు రైతులకు బీమా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– పుయ్యూరు సాంబిరెడ్డి, కొల్లిపర

బీమాకు ప్రతిపాదనలు పంపాం

విభజిత జిల్లాలో పసుపు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో బీమా వర్తించే అవకాశం లేదు. దీనిని గుర్తించి, రైతుల అభ్యర్థన మేరకు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ సూచనతో బీమా వర్తింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం.

– ఎన్.సుజాత, జిల్లా ఉద్యాన అధికారి

సీనియర్ ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్ ప్రారంభం



గుంటూరులోని ఓ కళాశాలలో ఫిజిక్స్ ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

గుంటూరుఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఆదివారం ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 135 కళాశాలల్లో జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 10,885 మంది విద్యార్థుల్లో 10,666 మంది హాజరయ్యారు. 11 కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు దరఖాస్తు చేసిన 958 మంది విద్యార్థుల్లో 874 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్జేడీ వీవీ సుబ్బారావు ఒంగోలులోని పలు కళాశాలలను తనిఖీ చేయగా, ఆర్ఐవో జి.సునీత గుంటూరు నగరంలో నాలుగు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరిశీలకురాలు శేషకుమారి గుంటూరు, నరసరావుపేటలో పలు కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ తీరును పరిశీలించారు. సైన్స్ ప్రాక్టికల్స్ మొదటి రోజు అధికారులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, హైపవర్ కమిటీ, డీఈవోలు జె.పద్మ, నీలావతి, ఆంజనేయులు కలుపుకుని మొత్తం 60 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రాక్టికల్స్ ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆర్ఐవో సునీత తెలిపారు.

ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నారాయణరావు

గుంటూరు మెడికల్: ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన సీనియర్ సర్జన్ డాక్టర్ వి.వి.నారాయణరావు ఎన్నికయ్యారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.ధర్మారావు నుంచి ఆయన బాధ్యతల్ని ఆదివారం స్వీకరించారు. ప్రస్తుతం డాక్టర్ వి.వి.నారాయణరావు అసోసియేషన్‌లో ప్రెసిడెంట్ ఎలక్ట్ హోదాలో ఉన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో ఆర్థోపెడిక్ సర్జన్స్ 52వ రాష్ట్ర వార్షిక సదస్సు శుక్రవారం ప్రారంభమై, ఆదివారం ముగిసింది. సదస్సు ముగింపు రోజు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర సెక్రటరీగా గుంటూరుకు చెందిన సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు, ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా తిరుపతికి చెందిన సునంద్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. మూడో రోజు సదస్సులో మోకీళ్ల లిగమెంట్స్ ఫ్యాక్చర్స్, పెల్విస్ అండ్ యక్టాబ్యులమ్, నీ, షోల్డర్, ఫుట్ అండ్ యాంకిల్ ఫ్యాక్చర్స్ గురించి పలువురు సర్జన్లు వివరించారు. రాష్ట్ర వార్షిక సదస్సు సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ విన్నర్స్‌గా, గుంటూరు జిల్లా చిన కోండ్రుపాడుకు చెందిన కాటూరి మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వైజాగ్‌కు చెందిన నార్త్ ఆంధ్రా ఆర్థోపెడిక్ అసోసియేషన్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచింది. సదస్సు సందర్భంగా ఒంగోలులో క్రికెట్ పోటీలు జరిగాయి. తొలిసారిగా సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. డాన్స్ పోటీల్లో గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మద్దెల ప్రశాంత్ సోలో విభాగంలో మొదటి బహుమతి, గ్రూప్ డాన్స్ విభాగంలో నెల్లూరు ఆర్థోపెడిక్ అసోసియేషన్ మొదటి బహుమతి గెలుపొందారు. ఏలూరులోని ఆశ్రమం కళాశాలలో వచ్చే ఏడాది వార్షిక సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. సదస్సుకు 700 మంది వైద్యులు పేర్లు నమోదు చేసుకున్నారని, సదస్సుకు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 70 మంది సీనియర్ వైద్యులు హాజరై, పలు అంశాల్ని వివరించారనిఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్ తెలిపారు.



డాక్టర్ నారాయణరావును అభినందిస్తున్న డాక్టర్ ధర్మారావు, డాక్టర్ జె.నరేష్‌బాబు తదితరులు

తైక్వాండో ఉమ్మడి గుంటూరు జిల్లా పోటీలు ప్రారంభం

రేపల్లె: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ పేర్కొన్నారు. న్యూ ఆంధ్ర ప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సారథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి మంచి గుర్తింపుతో పాటు భవిష్యత్ లభిస్తుందని చెప్పారు. డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తైక్వాండో పోటీలను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులుకు సబ్ జూనియర్ (అండర్–12), క్యాడెట్ (అండర్–14), జూనియర్, సీనియర్ విభాగాలలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పోటీలలో 150 మంది క్రీడాకారులు పాల్గొనారని, వీరిలో ప్రథమ స్థానం పొందిన క్రీడాకారులు మార్చి 10 నుంచి విశాఖపట్నంలోని యలమంచిలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, వార్డెన్ పి.శివశంకర్ ప్రసాద్, సభ్యులు ఎం.శ్రీనివాసరావు, వితల్‌కుమార్, ఎస్.వీరరాఘవయ్య, సిహెచ్.రంగ, కె.ప్రసాద్‌బాబు, కె.బాబూరావు, కె.వీర్లంకయ్య, కోచ్ దానేశ్వరరావు, పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు

ఇదిగో స్వర్ణోత్సవ ఆనందం

- ఘనంగా ఏజీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- 50 ఏళ్లు గుర్తుగా కలయిక

కళ్లలో శుక్లపు పొరలు కంటి చూపునకు అడ్డు పడుతున్నా.. వారి కనుపాపల్లో ఆనందాల జ్యోతులు వెలిగాయి. ఆ నడకల్లో సత్తువ మందగించినా.. ఆ వేదిక తాకగానే వారి పాదాలు నాట్యమాడాయి. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు 50 ఏళ్లు వెనక్కి వెళ్లాయి. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. అపూర్వ ఘట్టాలు వ్యవసాయ కళాశాలలో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి.

–బాపట్ల



1968-72బీఎస్సీ పూర్వవిద్యార్థులు

స్థానిక వ్యవసాయ కళాశాలలో 1968– 72 బీఎస్సీ(ఏజీ) వ్యవసాయ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. 50 సంవత్సరాలు తర్వాత కలయికతో అందరూ చాలా ఆనందోత్సాహాలతో ఒకరినొకరు పలకరించుకుంటూ సంతోషంగా గడిపారు. ఉద్యోగం చేయకుండా వ్యవసాయం, వ్యాపారం, ఇతర వృత్తులలో స్థిరపడిన బెల్లం కోటయ్య(పొగాకు ఎగుమతిదారు), కె.శ్రీమన్నారాయణ, బుల్లి గురవయ్య, నాగరాజు, ఎ.చంద్రశేఖర్లను కాలేజీ అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో 1968 బ్యాచ్ తరపున ఉల్పి శంకర్రావు, యు.వెంకట్రావు, శ్రీవాణి ప్రసాద్, బి.శ్రీమన్నారాయణలను సన్మానించారు. బెల్లం కోటయ్య స్నేహితులకు మెమెంటో బహూకరించారు.

ఆకర్షణ ఉన్న చోటే సంఘర్షణ

డాక్టర్ రావి రంగారావు

మంగళగిరి: ఆకర్షణ ఉన్న చోటే సంఘర్షణ ఉంటుందని అమరావతి సాహితీ మిత్రుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు పేర్కొన్నారు. నగరంలోని మార్కండేయ కల్యాణ మండపంలో ఆదివారం అభ్యుదయ కవి గోలి మధు రచించిన సంఘర్షణ కవితా సంపుటిని మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. డాక్టర్ రావి రంగారావు మాట్లాడుతూ ప్రశ్నించడం మానుకుంటే ప్రగతి వెనుకబడుతుందని, బలహీనపడుతుందని కవి మధు తన సంఘర్షణ పుస్తకంలో స్పష్టం చేయడం అభినందనీయమన్నారు. సమాజ స్వరూపాన్ని దర్శించి, దాని స్వభావాన్ని కంటికి కనిపించేలా కవి రచించారని ప్రశంసించారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ సున్నితత్వంలో నుంచే సంఘర్షణ మొదలవుతుందని చెప్పారు. సంఘర్షణ అంటే మనిషిలోని ఓ మానసిక భావన అని కవి పేర్కొనడం అభినందనీయమని కొనియాడారు. సీకే జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మంచా విజయమోహనరావు మాట్లాడుతూ మధు కవిత్వంలో సూటిదనం, కరుకుదనం స్పష్టంగా ఉందని తెలిపారు. మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ సమాజంలో అసమానతలపై, మనిషి చుట్టూ పరుచుకుంటున్న నీలినీడలపై సమరం పూరిస్తూ గోలి మధు సంఘర్షణలో ప్రతి కవిత విలువైనదని వివరించారు. కార్యక్రమంలో సాహితీ వేదిక కో- కన్వీనర్ రేఖా కృష్ణార్జునరావు, దామర్ల కుబేరస్వామి, ఆకురాతి మురళీకృష్ణ, కంచర్ల కాశయ్య, ఎండీ యూసఫ్, సందుభట్ల భూపతి, అల్లక తాతారావు, గోలి సౌమ్య పాల్గొన్నారు.



సంఘర్షణ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1903 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు నీరు వదలలేదు. బ్యాంక్ కెనాల్‌కు 148 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 275 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 39 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 174 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1160 క్యూసెక్కులు విడుదల చేశారు.

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యురాలిగా పద్మజ



పాత గుంటూరు: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కమిటీ కార్యనిర్వాహక సభ్యురాలిగా తెనాలికి చెందిన శ్రీశ్రీ కళావేదిక గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు పోలిశెట్టి పద్మజ రామకృష్ణ నియమితులయ్యారు. శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో 'తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు' నిర్వహిస్తున్నారు. కవిత, నాటకం, మిమిక్రీ, నాట్యం, సంగీతం, జానపదం, సాహిత్యం, పుస్తకావిష్కరణలు తదితర కార్యక్రమాల్ని 48 గంటల పాటు నిర్విరామంగా జరుపుతారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గుంటూరు జిల్లాలోని కవులు, కళాకారులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని పద్మజ పిలుపునిచ్చారు. వివరాలకు 8247519925ను సంప్రదించాలని ఆమె కోరారు.

బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గం

నరసరావుపేట ఈస్ట్: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కొరబండి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కూచిపూడి చంద్రశేఖర్, కోశాధికారిగా విప్పర్ల చంటిబాబు నియమితులయ్యారు. ప్రకాష్‌నగర్‌లోని ఎన్జీవో హోంలో భారతీయ బౌద్ధ మహాసభ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎలిచర్ల హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యక్షునిగా నల్లపు కోటేశ్వరరావు, గౌరవ సలహాదారునిగా కోండ్రు మోహనరావు, సహాయ కార్యదర్శులుగా గంటెల శివప్రసాదు, పప్పుల త్రికోటేశ్వరరావు, అధికార ప్రతినిధిగా జి.హరిబాబు నియమితులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కె.బోది, సహాయ కార్యదర్శి యంద్రపాటి అశోక్‌కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు జి.మధుబాబు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■10th, ఇంటర్(ఒకేసం॥లో), డిగ్రీ(1-3సం॥లో) BA, BCom, BSc, MA, MCom, MBA, MSc (All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11 బ్రాడీపేట,Gnt☎8008145999

■ ఆంధ్రా SVయూనివర్శిటీల నుండి ఇంటర్ పాసైనవారు B.Sc,BCom,BAలను 3సం॥లలో పొందుటకై సంప్ర॥ శ్రీ సత్యమూర్తి కాలేజీ, 4/18 బ్రాడీపేట,గుంటూరు☎9346446079,6301865302

REAL ESTATE

■ 3600చ॥గ॥ NH-16 ప్రక్కన కొత్తగా కడుతున్న లలితహాస్పిటల్ దగ్గరలో మరియు పాత గుంటూరు సుద్దపల్లిడొంక నందు అతి తక్కువ ధరకే ఇళ్ళ ప్లాటు లభించును. శ్రీకృష్ణ ఇంజనీర్స్‌కన్స్ట్రక్షన్స్☎7981382496,9246480109

PLOT FOR SALE

■ గుంటూరు ఆటోనగర్ ఫేస్–2 నందు ఇండస్ట్రియల్ సైట్ ఉత్తరం ఫేసింగ్ 2000 చ॥గ॥ స్థలంలోని షెడ్‌తో సహా అమ్మబడును.నోబ్రోకర్స్☎9866463999

BUSINESS OFFER

■గుంటూరు సిటీలో రన్నింగ్‌లో ఉన్న స్కూల్ లైసెన్స్ అమ్మకానికి కలదు. 9603888558

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ 96590 57777

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

■సంప్ర. సెల్: 79977 89771, బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. (100% జెన్యూన్)

HEALTH CARE

ఆయుర్వేదం

■బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747

MARRIAGE SERVICES

■రెడ్డి,నాయుడు, క్రిస్టియన్ పెళ్ళిసంబంధలకై డాక్టర్లు, సాఫ్ట్‌వేర్, ఉద్యోగులు, ప్రవేట్ జాబ్స్, డిగ్రీ వరకు సంబంధములు చూడబడును.సంప్ర॥M Rama rao A.T.అగ్రహారం,4వలైను, గుంటూరు☎9490639640

WANTED

■ సెక్యూరిటీ సంస్థలో కొండ్రుపాడు, తిమ్మాపురం ఏరియాలలో 12గం॥ డ్యూటీ చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం + రూం ఫ్రీ + సబ్సిడీ మీల్స్. సంప్ర॥ 9347294830, 9553013430

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెని నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి క్రొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ : 7730899508

■ శ్రీ వీరాంజనేయ స్వామి ఎంటర్‌ప్రైజెస్, జిన్నాటవర్ సెంటర్ గుంటూరు వాచ్‌షాపు నందు పనిచేయుటకు హెల్పర్లు, వాచ్ మెకానిక్స్ కావలెను☎9247280700,8533820007

■ ఇంటిపని చేయుటకు ఆడమనిషి కావలెను. గుంటూరులో శాకాహారులు ఇంట్లోనే ఉండి ఇంటి పనిచేయుటకు ఏ బాదరబందీలేని ఒంటరి మహిళ కావలెను. తెలుగు చదవటం, వ్రాయటం వచ్చి ఉండవలెను. ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరములకై సంప్రదించవలసిన ఫోన్ నెం: 9010299252

■ ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్‌మాల్స్, Ltd కంపెనీల్లో 10th,ఇంటర్,డిగ్రీ,B.Tech చదివి ఖాళీగా ఉన్నవారికి మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్. సంప్ర: 9963255441

■ గుంటూరులోని ప్రముఖ టూవీలర్ ఫైనాన్షియల్ కంపెనీ నందు వర్క్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Qul : డిగ్రీ. Age: 25సం॥లోపు. సంప్ర॥☎8978855399

■ ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు వార్డు బాయ్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 11000/–. సంప్ర॥ ☎8297528440, 8309062183

■ బార్& రెస్టారెంట్ నందు పనిచేయుటకు P/T, F/T లిక్కర్‌బాయ్స్, సప్లయర్స్ కావలెను. భోజన వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9573271161, 8143198968

■ Success ట్రేడింగ్, మాకు టెలిగ్రామ్, ఫేస్‌బుక్ యుట్యూబ్, ట్విటర్ మొదలైనసామాజిక మాధ్యమాలలో నిపుణులు కావాలి. మా కంపెనీ ప్రమోషన్ & డేటాఎంట్రీకోసం.Cont:గుంటూరు☎8855834567

■ వ్యాపార సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్,ఆఫీస్‌అసిస్టెంట్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 6305874799

■ ప్రముఖ సంస్థ, గుంటూరు నందు పని చేయుటకు టెలికాలర్స్ మరియు ఆఫీస్ స్టాఫ్, స్మార్ట్ లేడీస్ కావలెను. సంప్ర॥ ☎8639578021

■ మంగళగిరి : ప్రముఖ దంత వైద్యశాల నందు పనిచేయుటకు అసిస్టెంట్ కావలెను. సంప్ర॥ ☎8374621551

■ GNTకాకానిరోడ్‌లో+బ్రాడీపేటలో వర్క్‌చేయుటకు లేడీ టెలికాలర్స్+ఇన్చార్జ్‌మేనేజర్ 60 కావలెను. నో టార్గెట్స్,T.9:00AM-6PM,జీ:8000-13000స్పాట్ జాయినింగ్ ☎9985137349, 9154170998

■ గుంటూరు నందు వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ వర్క్ చేయుటకు కావలెను. జీతం / కమీషన్ పద్దతిపై నెలకు 10K–15Kఆదాయం☎9553877377

■ పిడుగురాళ్ళలోని ప్రముఖ ట్రాక్టర్ షోరూమ్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు మహిళ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. మంచి జీతం+ఇన్సెంటివ్స్ఇవ్వబడును☎7995078163

■ తెనాలిలోని ప్రముఖ వి.కార్డియాక్ హాస్పిటల్ నందు పనిచేయుటకు అంబులెన్స్ డ్రైవర్, నర్సింగ్ స్టాఫ్, మేల్ ఫార్మసిస్ట్ కావలెను. అనుభవం బట్టి మంచిజీతం. 08644-355799/ 7095220001

■ సంపన్నుల ఇళ్ళలో మంచాన పున్న వృద్ధులను, పేషంట్లను వారి ఇంటి వద్దనే బాధ్యతగా చూసుకొనుటకు ఆయాలు, 8వ క్లాస్ M/F VJA కి కావలెను. Sal 14-20K, వసతి భోజనం. 9160835559, 7815835561

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520

■ ప్రముఖ Y.M.C. కంపెనీలో జాబ్ చేయుటకు 18 సం॥ నిండిన యువకులకు ఉచిత శిక్షణ అర్హత 10th to డిగ్రీ (P/F) + ఫ్రీ రూం. శిక్షణలో 12000/- శిక్షణ తర్వాత 32000/- సంపాదన, సెల్: 9032186841.

■ వెంటనే కావలెను బెంగుళూరులో ప్రొడక్షన్ వర్క్‌లో పికింగ్,ప్యాకింగ్, స్కానింగ్ మరియు బిల్లింగ్ చేయుటకు హెల్పర్స్. రూం+ఫుడ్ జీతం 15,500 -18,000. సంప్ర:6741121160, 6384385003.

■ ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్‌కేర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. Qly: 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/– To 29,000/– రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18–35 సం॥. ✆ 8885017984.

■ నరసరావుపేట, యలమందలో ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సెక్యూరిటీ సూ॥వైజ॥, గార్డ్స్ (అప్రెంటిస్) కావలెను, డ్యూటీ 8, 12 గం॥, జీతం 11,000, 10,500/- PF, ESI రూమ్ + భోజన సౌకర్యం. ✆ 99859 56778

■ గుంటూరులోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థనందు మార్కెటింగ్ మరియు టెలికాలింగ్ చేయుటకు వివాహితులైన స్త్రీలు కావలెను. సంప్రదించవలసిన ఫోన్ నెం: 86396 89939

■ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన వరకు జీతం. మరిన్ని వివరాలకు సంప్ర : 90631 32743

■ రేపల్లె హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీతం: 20K ఏజెంట్ కమీషన్ 5K. ఫోన్ : 9640900074

■ ప్రముఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లో కార్గో లోడర్స్, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను, జీతం: 22000/– ఆపైన, వ: 18–35, రూమ్+ భోజనం ఫ్రీ. ఫోన్ : 8886186894.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ సెంటర్లలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97034 67843
97030 13015
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు

- పది గొర్రెలు మృతి
- మరో ఆరుకు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: వేగంగా వెళుతున్న కారు గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఘటన వేకువజామున పాత మద్రాసు రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం చింతాయపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు జీవాల కాపరులు తమ గొర్రెల మందను తీసుకుని కొద్దిరోజుల కిందట గుంటూరు జిల్లాకు వచ్చారు. కొండలు, అటవీ ప్రాంతాల్లో మేపుకుని తిరిగి శనివారం రాత్రి తమ ప్రాంతానికి తోలుకుని వెళుతున్నారు. తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో పెదనందిపాడు వైపు నుంచి వస్తున్న కారు ప్రత్తిపాడు శివారులో మందపైకి దూసుకొచ్చింది. దీంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఆరింటికి తీవ్ర గాయాలపాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. మేకల కాపరులతో మాట్లాడారు. కారు నడుపుతున్న కాకుమాను మండలం అప్పాపురం గ్రామానికి చెందిన సాదరబోయిన తిరుమలరావుతో పాటు వెంట ఉన్న కద్దా కనకయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. ఈ మేరకు జీవాల కాపరి వడ్లమూడి గోపి ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు.



మృతి చెంది రోడ్డు వెంబడి పడి ఉన్న గొర్రెలు

బాలుర హాస్టళ్లు, గదుల్లో విస్తృత తనిఖీలు

నగరంపాలెం: బాలుర వసతి గృహాలు, విద్యార్థుల గదుల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ముందస్తు సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున పలు ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గుంటూరు నగరంలోని పట్టాభిపురం, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి సోదాలు చేశారు. యువకుల పేర్లు, ఏయే ఊర్ల నుంచి వచ్చారు, ఇక్కడ ఎన్నాళ్లుగా ఉంటున్నారు, ఏం చదువుకుంటున్నారనే అంశాలపై ఆరా తీశారు. సంచులను కూలంకుషంగా పరిశీలించారు.అనుమానితుల వివరాలను నమోదు చేసుకున్నారు.



సంచులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

అనుపు జలాశయంలో మునిగి యువకుడి మృతి

విజయపురిసౌత్: అనుపు కృష్ణా జలాశయంలో మునిగి యువకుడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణలోని నల్గొండ జిల్లా, మర్రిగూడ మండలం, దామనవారి భీమనపల్లి గ్రామానికి చెందిన ఇటుకలపాటి ప్రకాష్(32), బంధువులు ఇద్దరితో కలసి విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత దేవాలయానికి వచ్చాడు. దర్శనం అనంతరం పర్యాటక ప్రాంతమైన అనుపునకు వెళ్లారు. అక్కడి కృష్ణా జలాశయంలో ముగ్గురు స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తూ ప్రకాష్ కాలు జారి జలాశయంలో మునిగి మృతి చెందాడు. ప్రకాష్ బంధువులు ఫిర్యాదు మేరకు విజయపురిసౌత్‌ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అనుపు కృష్ణా జలాశయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రకాష్

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి

చిలకలూరిపేట: గొర్రెల షెడ్డులోకి వీధి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేసి చంపివేసిన ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని పసుమర్రులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పసుమర్రుకు చెందిన షేక్ సుభాని గొర్రెలు పెంచుతాడు. అతడికి గ్రామం పొలిమేరలో గొర్రెల షెడ్డు ఉంది. ఈ షెడ్డులోకి శనివారం అర్ధరాత్రి 12 నుంచి ఒంటిగంట సమయంలో వీధి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో 11 గొర్రెలు ఘటన స్థలంలో చనిపోయాయి. మరో ఐదు చిన్న గొర్రెలను కుక్కలు షెడ్డులో నుంచి లాక్కెళ్లాయి. వీటి కోసం గాలించినా జాడ కానరాలేదు. గాయపడిన మరో ఆరు గొర్రెలను పసుమర్రు పశువైద్యశాలకు చెందిన డాక్టర్ పి.దీప్తి బాధితుడి సమాచారం మేరకు రాత్రి సమయంలోనే ఘటనా స్థలానికి వెళ్లి చికిత్స అందించారు.



ఫ్యాక్షన్ రాజకీయాలకు చంద్రబాబు కుట్ర

- బ్రహ్మారెడ్డి విమర్శలు అర్థరహితం
- ప్రభుత్వ విప్ పీఆర్కే



మాచర్ల: పల్నాడులో ఫ్యాక్షన్ రాజకీయాలను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ఆరోపించారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న తాను ఇప్పటికీ ప్రజల ఆశీస్సులతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని గుర్తు చేశారు. తనను విమర్శించే స్థాయి టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డికి లేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తాను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయి గుంటూరులో నివాసముంటూ నాపై విమర్శలు చేయటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలలో ఏడు హత్యలు చేయించి, ఆ తరువాత ఇప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తూ వారే వివిధ ప్రాంతాల్లో వారి పార్టీకి చెందిన వాహనాలు దహనం చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శవ రాజకీయాలు చేసిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించేందుకు బ్రహ్మారెడ్డి వచ్చినట్లు పీఆర్కే ఆరోపించారు. దొంగతనాలు, దోపిడీలు చేసిన వ్యక్తి హత్యకు గురైతే నీ అధిష్టాన నాయకుడు పాడె మోసి ప్రచారం కోసం దిగజారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడో సారి బ్రహ్మారెడ్డి ఓడిపోవడం ఖాయమని చెప్పారు. అది జరగక్కపోతే నేను రాజకీయాలకు దూరంగా ఉంటానని పీఆర్కే సవాల్ విసిరారు.

చదువుకు అల్పా'హారం'

- జెడ్పీ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రతి రోజూ అల్పాహారం పంపిణీ
- సంతృప్తిగా తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు
- హెచ్‌ఎంలు, స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో ప్రతిరోజూ పాఠశాలల్లో క్రమం తప్పకుండా పంపిణీ



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించే ప్రక్రియ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థుల కడుపు నింపేందుకు జిల్లా ప్రజా పరిషత్ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధతో కేటాయించిన రూ.49.73 లక్షల నిధులతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 351 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 22,104 మంది విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందిస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు ఈనెల 15వ తేదీన మొదలైన అల్పాహారం పంపిణీ 30 రోజుల పాటు కొనసాగనుంది. టెన్త్ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా ఇప్పటికే రూ.61.80 లక్షలతో జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయగా, ఆర్థిక ఇబ్బందులతో అల్పాహారానికి నిధులు ఇవ్వలేని పరిస్థితుల్లో విద్యార్థులు అర్థాకలితో హాజరవుతున్నారనే కారణంతో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చొరవతో నిధుల కేటాయింపు జరిగింది.

డీఈఓల ఖాతాలకు నిధులు బదిలీ

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖాధికారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన జెడ్పీ నిధులతో ఒక్కో విద్యార్థికి రూ.7.50 చొప్పున కేటాయించిన మొత్తంతో ప్రతి రోజూ అల్పాహారాన్ని అందిస్తున్నారు. ఈ విధంగా మూడు జిల్లాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతోంది. పౌష్టికాహారం కింద బ్రిటానియా బిస్కెట్లు, సన్‌ఫీస్ట్ బిస్కెట్లు, కోడిగుడ్లు, వేరుశనగ ఉండలు, గుగ్గిళ్లు (అలసందలు, పెసర) వంటి తినుబండారాలను పది విద్యార్థులకు అందజేస్తున్నారు.

జిల్లా	జెడ్పీ పాఠశాలలు	విద్యార్థులు	నిధుల కేటాయింపులు
గుంటూరు	112	6,896	రూ.15,51,600
పల్నాడు	169	11,785	రూ.26,51,625
బాపట్ల	70	3,423	రూ.7,70,175

బలవర్ధకమైన ఆహారం ఇస్తున్నారు



సాయంత్రం పూట ప్రత్యేక తరగతుల్లో బలవర్ధకమైన తినుబండారాలు అందజేస్తున్నారు. ఈరోజు అలసందలతో చేసిన గుగ్గిళ్లు ఇచ్చారు. గతంలో తరగతులకు హాజరైనప్పుడు ఆకలిగా ఉండేది. ప్రస్తుతం ఆ ఇబ్బంది లేదు.

–ఎం. చంద్రిక, టెన్త్ విద్యార్థిని

ఎంతో ఇష్టంగా తింటున్నాం



ప్రతి రోజూ ఇష్టమైన ఆహార పదార్థాలు ఇస్తున్నారు. అరటిపండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, గుగ్గిళ్లు, వేరుసెనగ ఉండలు ఎంతో రుచిగా ఉంటున్నాయి. న్యూట్రిషన్ ఫుడ్‌తో ఆకలి తీరడంతో ప్రత్యేక తరగతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా హాజరవుతున్నాం.

–కె. హర్షిత, టెన్త్ విద్యార్థిని